# యవనికాభ్యంతరమున...

"నేను గుంటూరులో వున్నప్పుడు..." అన్నాడు నారాయణ చాలా బరువుగా మా అందరికేసి చూస్తూ.

అందరం సర్దుక్కూచున్నాం.

భావనారాయణ ఓ సిగరెట్టు అంటించి, ఆ పొగతోనే అగ్గిపుల్లను ఆర్పేసి, చూపుడువేలుతో సుతారంగా దాన్ని గాల్లోకి విసిరేసి, ఓ పొడి దగ్గు దగ్గి, పట్టని చెమటను ఓసారి తుడుచుకొని మెల్లగా ప్రారంభించాడు.

"ఎందుకలా జరుగుతాయో చెప్పలేం! కానీ జరుగుతాయి. వాటికి ఎవ్వరూ కారణంకాదు. ఎవ్వరూ అలా జరగాలని గూడా అనుకోరు. కానీ ఏ బలీయమైన విధిశక్తో పరిస్థితులను అలా గెంటుకుంటూ వచ్చి, బతుకులనిండా దుమ్మూ దూగరా నింపేస్తూ వుంటుంది. దాన్ని దులుపుకొందుగ్గానీ, ఊపిరిపీల్చుకొందుగ్గానీ అవకాశ ముండదు. అవంతే ఎవ్వరినీ మనం నెపం పెట్టలేం!" అంటూ ఇరుగ్గా చూశాడు భావనారాయణ.

ఈ మధ్యకాలంలో, వాడింత "బరువు" మనిషి కావడం మేం చూళ్ళేదు.

"డాక్టర్ నారాయణరావు పేరు మీకు తెలిసే వుంటుంది" అన్నాడు భావనారాయణ, ఓసారి అందరికళ్ళూ వెదుకుతూ.

"నాకో నారాయణరావు తెలుసు. అతనుగూడా డాక్టరే ననుకొంటాను - కాదు డాక్టరే! అతను ఆత్మహత్య చేసుకొన్నాడని ఆమధ్య పత్రికల్లో చదివాను. అతనయితే-" అన్నాను.

"అవును, అతనిసంగతే చెబుతూంట" అన్నాడు భావ నారాయణ. "అతను నాకు స్నేహితుడు. ఆ కారణంగా ఆయన ఆత్మహత్య విషయం నాకు తెలుసు -నా కొక్కడికే తెలుసు ననుకొంటాను."

"ఏమిటది?" అన్నా రెవరో.

"ఇంతకాలం దాన్ని పదిలంగా దాచిపెట్టాను. ఇప్పుడా తెర తొలగించి అతని ఆత్మను క్షోభపెట్టడం నా కిష్టంలేదు" అన్నాడు భావనారాయణ కాస్సేపాగి, సిగరెట్టును దూరంగా విసిరేసి, సున్నితంగా వేళ్ళను మెటికలు విరుచుకొని, రెండు చేతులూ వెనక్కు ఆనించి. మెడ నరాలు చిటపటమనేటట్టు విరుచుకొన్నాడు.

"ఒక్కో మనిషిని చూడంగానే మన కెందుకు సద్భావం కలుగుతుందో; ఇంకోణ్ని చూడంగానే, ఎందుకు అసహ్యమేస్తుందో స్పష్టంగా చెప్పలేం. మనకు సరిపడని

భావాలు, ఇష్టంలేని రూపురేఖలు అవతలి వ్యక్తిలో మనం చూడటం ఇందుకు కారణమనుకొంటాను. మన సదభిప్రాయాలు గూడా మన ప్రవృత్తులనుబట్టే ఏర్పడుతుంటాయనుకొంటాను. ఎదటివారిలోని గుణాగుణాలు కేవలం వారివి మాత్రమే గాదనీ, అందులో మన భాగంకూడా కొంత వుంటుందనీ మన మొప్పుకొంటే, చాలా సమస్యలకు పరిష్కారం సులభమవుతుందేమో ననిపిస్తుంది...ఎందుకంటున్నానంటే, డాక్టర్ నారాయణరావుకూ నాకూ మధ్య అరమరికలు లేకుండా పోవడమే కాదు, దాచుకోవలసినవి గూడా ఏమీ మిగల్లేదు. ఎంతోకొంత కృత్రిమత్వం, ఆత్మవంచన, నటన లేనిదే, వ్యక్తిత్వం పూర్ణరూపానికి రాదనుకొంటాను. మనస్సు జివ్వుమని రొదపెట్టే సత్యంకన్నా తాత్కాలికంగానే అవుగాక - జోగిపోయే అసత్యం కావాలనే మనకుంటుంది. ఈ తెరలు - రంగురంగుల తెరలు - తొలగిపోయాక కనుపించే నగ్న దృశ్యాలను చూడలేం! చూసినా భరించలేం! అంచాతనే చూడకుండా తప్పుకొందుకే మనం ప్రయత్నం చేస్తుంటాం. దురదృష్టవశాత్తూ మా ఇద్దరిమధ్యా వున్న తెరలను నేనే తీసేశాను'' అన్నాడు భావనారాయణ, ఓ క్షణం కళ్ళు గట్టిగా మూసుకొని.

"నారాయణరావు మంచివాడు. అంతకన్నా అతన్ని గురించి చెప్పేందుకు నా వల్లకాదు. ఎంత మంచి వాడంటే- ఎంత మంచో చెప్పేందుగ్గూడా మరో మనిషి నా కందుబాటులోలేడు. బ్రతుకు వెలుగులూ నీడలూ అతను అనుభవించాడు. దరిద్రం కడముట్టా చూశాడు. కష్టాలు దిగమిం

గాడు. చట్టుమీద మొలిచిన మొక్కలాంటివాడు నారాయణ రావు. చట్టుకూ మొక్కకూ జరిగిన సంఘర్షణలో మొక్క గెలిచింది; చట్టు వోడిపోయింది. అయినా అతనిలో గర్వం లేదు. విజయానందం లేదు. అహం లేదు. గతాన్ని మరిచి పోలేదు. అన్నీ తేదీలవారీగా చెప్పుకొచ్చేవాడు. దాచేవాడు కాదు. నాకే ఒక్కోసారి అనిపించేది — ఇంతలా ఈ మనిషి బయటపడిపోతున్నాడే—ఇతనంటే గౌరవం తగ్గిపోదా అని !

"నారాయణరావు పెళ్ళి—అదో గమ్మత్తు. మామగారు బాగా ఉన్నవాట్ట. ఎంతో కట్నమిస్తా నన్నాట్ట. అయినా మనవాడు వొప్పుకోలేదుట. పోనీ బాగా ఆర్జనన్నా ఉందా-లేదు. ఏదో న్యాయ మంటాడు. ధర్మమంటాడు. అమితంగా డబ్బు పిండుకోవటం అమానుష మంటాడు. ప్రజల అనారోగ్యంమీద బ్రతకటం పాప మంటాడు. రోగంవల్ల బ్రతికే క్రిములకూ డాక్టర్లకూ భేదంలేదంటాడు. అన్నా ఫర్వాలేదు. అవన్నీ చేస్తాడు గదా ఖర్మం ! అక్కడే నాకు నారాయణ రావంటే గిట్టదు. ఆదర్శాలు, ఇకెన్ని చెప్పినా నా కభ్యంతరంలేదు. ప్రతి రోజూ పత్రికల్లో ఎన్ని ఉద్బోధలు, ఉద్ఘోషలు, ఉద్ఘాటనలు వెలువడుతున్నాయి గాదు! వాటిని విన్నవారుగానీ, చదివినవారుగానీ అవన్నీ ఆచరించే ప్రమాదమే జరిగితే, ముందు తరాలవారు చేసేందుకు మంచి పనే ఉండదే మరి ?

"నారాయణరావు మెత్తగా నవ్వి, సుఖంగా కుర్చీకి జారగిల బడేవాడు. 'ఇంకోరికీ నాకూ పోలికలు తీసుకురాకు. వాళ్ళకు అంతరంగం, ఒకటున్నదో లేదో నాకు తెలీదు. కానీ

నా కున్నది. మరో మనిషికి నేను సమాధానం చెప్పినా — చెప్పకున్నా, కనీసం నాకు నేనన్నా చెప్పుకోవాలి. ఇంకో వ్యక్తిని మోసగించినంత సులభంగా మనని మనం మోసగించుకోలేం! ఏమంటావ్?' అనేవాడు నారాయణరావు.

'వాటికి అడ్డమైన పేర్లూ తగిలించి నువ్వు పాడుచేస్తున్నా వనుకొంటాను' అన్నా నోసారి గట్టిగా.

'అదేం ?' అన్నాడు నారాయణరావు.

'అందరూ దొంగలై, నువ్వొక్కడివే యోగ్యుడవైనట్టు మాట్లాడకు. మనుషులతో సరిపెట్టుకోలేకపోవడం అసమర్థత అవుతుందిగానీ, ప్రత్యేకత కాదు. అన్యాయంగా ఆర్జించమని నిన్ననడంలేదు. ఆర్జనకు 'అన్యాయం' అంటూ ఓ దిక్కుమాలిన విశేషణం తగిలించకు. నిజం చెప్పాలంటే- ఆపని చెయ్యడం నీవల్లకాదు. ఆ ధైర్యమూ, చొరవా నీలో లేవు. లేవని ఒప్పుకొనేందుకు నీ కిష్టంలేదు. నువ్వన్నట్టు — నీ అంతరంగం రొద పెడుతుంది. ఆ రొదనుండి పారిపోయేందుగ్గాను, 'అన్యాయం-అధర్మం' అంటూ నీకు నువ్వు నచ్చచెప్పుకొనే ప్రయత్నంలో ఆత్మవంచన చేసుకొంటున్నా వనిపిస్తుంది. కాదా?' అన్నాను.

'అర్థంచేసుకొనే వ్యక్తి స్థాయినిబట్టి గుణా గుణాలు ఉంటాయనుకొంటాను. ఒక్క భగవద్గీత లక్షమందికి లక్ష రకాలుగా కనిపిస్తోంది. ఎవ రేం చేస్తారు? ఎవరిది తప్పనగలం? గీతోపదేశం అయ్యాక అర్జునుడు బంధువులను, గురువులను నిర్దాక్షిణ్యంగా చంపాడు. గీత చదివాకనే సర్వం త్యజించిన

వారినీ నాకు తెలుసు. కాబట్టే అబ్బాయీ—'అంటూ నారాయణరావు మెత్తగా నవ్వి, మాట పూర్తిచెయ్యకుండానే ఆగిపోయాడు.

''ఇలాంటి కబుర్లు గంటలగ్గంటలు తినేసేవి. కానీ ఏదీ తేలేది కాదు. రాత్రి పదింటికి హాస్పిటల్ మూసి, వీధి చివర ఇద్దరం విడిపోయేవాళ్ళం. మళ్ళీ ఉదయం కలుసుకొన్నప్పుడు ఇవే గొడవలు ...

"నారాయణరావు ఏమవుతాడని కాదు నా బెంగ, అతని కుటుంబం సంగతేమిటని! అతనిభార్య ఇంత ఉన్న కుటుంబంనించి వచ్చింది. ఇతగాడేదో ఆర్జించి, సుఖాలు పోస్తాడనుకొంది. హాయిగా వుండవచ్చు ననుకొంది... నిజానికా దశలో ఎవరైనా అంతే—అనుకొంటారు. కానీ నారాయణరావు ఫక్తు వ్యతిరేకమయ్యాడు. ఆమె కలలు చిక్కుపడిపోయాయి. వాటిని ఏమాత్రం విడదీయగలిగినా చాలు ననిపించింది నాకు.

"చివరకు నేనే గెలిచాను. నారాయణరావు ఓడిపోయాడు. పరిస్థితులు కూడా నన్నే బలపరచాయి. పట్టుమని నాలుగేళ్ళు గడవలేదు. పూర్తిగా మారిపోయాడు నారాయణరావు. ఇన్నేళ్ళ తరవాత డబ్బు విలువ తెలుసుకొన్నాడు, రావు. తెలుసుకొన్నాక రెండుచేతులా పింకటం ప్రారంభించాడు. ఎదటివారికి నొప్పిలేకుండా కావలసినపని సానుకూలం చేసుకోవడంలో ప్రావీణ్యం సంపాదించాడు. రెండు

ఇళ్ళు కట్టాడు. కారు కొన్నాడు. తమ్ముణ్ణి పెద్దచదువుకు అమె రికా పంపించాడు. మూడు నాలుగు బాంకుల్లో డబ్బు నిలవ చేశాడు! తన క్రింద మరో నలుగురు డాక్టర్లను వేసుకున్నాడు. క్షణం తీరికలేకుండా పోయింది నారాయణరావుకు.

'ఇప్పు డేమంటావ్?' అన్నా నోసారి అతగాడితో.

'నువ్వే రైటంటాను' అన్నాడు నారాయణరావు చిరునవ్వుతో. 'మంచిదో చెడ్డదో వున్న ప్రపంచమిది. దీన్ని మార్చాలన్నా, దీనిలో వుండే మార్చాలి గానీ, బైటి కెళ్ళి కాదు. మనం చెప్పేది ప్రపంచం వినాలనుకొన్న ప్పుడు, ప్రపంచం చెప్పేది మనంకూడా వినాలి. అబ్బాయీ-దేనికీ యుద్ధం పరిష్కారం కాదు, సహజీవనం, సహజీవనం' అన్నాడు నారాయణరావు పకపకా నవ్వుతో.

"ఆ నవ్వులో ఏదో వెలితి, మురికి వున్నట్లనిపించింది నాకు.

"అతని పేరూ, అర్జునా, ఝుమ్మని కరిగిపోతున్న తరుణంలో, అతను ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎందుకు చేసుకొన్నాడో చాలామందికి తెలీదు. బహుశా నా కొక్కడికే ఆ కారణం తెలుసు ననుకొంటున్నాను" అన్నాడు భావనారాయణ, చేతి కంటుకొన్న రేగడి బెడ్డలను దులుపుకొంటూ.

"ఎందుకని చేసుకొన్నాడంటావ్?" అన్నా రెవరో ఆదుర్దాగా.

భావనారాయణ బరువుగా నవ్వాడు.

"చెప్పను" అన్నాడు భావనారాయణ తల అడ్డంగా తిప్పుతూ, "ఇప్పటికే అతనిపట్ల చాలా అన్యాయం చేశా ననుకొంటున్నాను. ఆ వొక్క కారణం చెప్పేసి, అతని ఆత్మను మరింత క్షోభ పెట్టడం నా కిష్టంలేదు."

బహుశా భావనారాయణ కళ్ళల్లో నీరు వూరి వుంటుంది; కాకపోతే జేబుగుడ్డతో కళ్ళ నెందు కొత్తు కొంటాడు మరి ?